సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 29 । జనవరి । 2024



రూ.1.11 లక్షల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కర్లపూడి గంగన్న (బినకొండే పూడి) రూ.1,11,111 విరాళం అందించారు.



దుర్గమ్మకు కాసుల పేరు

ఇంద్రకీలాద్రి (విజయవాడ): కనకదుర్గమ్మకు హైమావతి, జేవీకేటీ ప్రభాకరరావు (రాజమహేంద్రవరం) రూ.1.70 లక్షల 23.5 గ్రాముల బంగారు కాసుల పేరు సమర్పించారు.

10,950 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 10,950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 9 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యాన కంప్యూటర్ బేసిక్స్, అకౌంటింగ్, ఫొటోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. దీనికి 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిలై, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోగా www.rseti.in/online&application&rjy తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని వారు తమ ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రాజమహేంద్రవరం ఐఎల్‌టీడీ వద్ద ఉన్న శిక్షణ సంస్థలో సంప్రదించాలని తెలిపారు. శిక్షణ అనంతరం రెండు ప్రభుత్వ సర్టిఫికెట్లతో పాటు, ఉచిత టూల్‌కిట్లు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 85559 88580, 90143 28803 ఫోన్ నంబర్లలోను, 8500 8550 63 వాట్సాప్ నంబర్‌లో సంప్రదించాలని శ్రీనివాసరావు సూచించారు.

కోటసత్తెమ్మ తల్లికి రూ.2.01 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయం ద్వారా అమ్మవారికి రూ.2,01,884 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.

లోవకు పోటెత్తిన భక్తులు



తలుపులమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

తుని: తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ, ప్రైవేటు కాటేజీలు పూర్తిగా నిండిపోవడంతో భక్తులు చెట్ల కిందే వంటలు, భోజనాలు చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,48,875, పూజా టికెట్లకు రూ.1,83,500, కేశఖండన టికెట్లకు రూ.4,080, వాహన పూజ టిక్కెట్లకు రూ.3,190, కాటేజీల ద్వారా రూ.67,350, ఇతర డొనేషన్ల రూపంలో రూ.70,422 కలిపి మొత్తం రూ.4,77,327 ఆదాయం సమకూరిందని ఆయన వివరించారు.

అయినవిల్లిలో భక్తుల సందడి



విఘ్నేశ్వరస్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో భక్తులు సందడి చేశారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన స్వామికి మేలుకొలుపు సేవ, అనంతరం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ నిర్వహించారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 79 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 398 మంది భక్తులు, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 14 మంది పాల్గొన్నారు. 28 మంది నూతన వాహన పూజ నిర్వహించారు. ఇద్దరు చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,75,384 సమకూరాయని ఆలయ కమిటీ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

మహిళలే మహారాణులు

- ఇళ్లకు వారే యజమానులు
- నేటి నుంచి మహిళల పేరిట పక్కాగా రిజిస్ట్రేషన్లు
- వచ్చే నెల 9లోగా పూర్తి
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- స్థలంతో కలిపి ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకూ ఆస్తిపై పూర్తి హక్కు
- ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మందికి లబ్ధి



కొవ్వూరు మండలం కాపవరంలోని జగనన్న కాలనీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పేదల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లకు ఆ ఇంటి మహిళనే యజమానురాలిగా చేస్తున్న అపూర్వ ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఎప్పుడెప్పుడా అని మహిళలందరూ కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఆశగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీలు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వీటిల్లో ఇప్పటికే ఇంటి స్థలాల పట్టాలను మహిళల పేరిట ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆ స్థలాలను ఆ మహిళల పేరిటే రిజిస్ట్రేషన్ చేసే బృహత్తర కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుడుతోంది. దీనికి ఉమ్మడి తూర్పు గోదావరి వ్యాప్తంగా ఆయా జిల్లాల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇక లక్షాధికారులే..

ఇన్నాళ్లూ తమ పేరిట సెంటు భూమి లేదని వేదన చెందుతున్న పేద, మధ్య తరగతి మహిళలు.. ఇప్పుడు తమను ఒక్కసారిగా లక్షాధికారులను చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వేనోళ్ల పొగుడుతున్నారు. మహిళలకు ఇచ్చిన మాట కోసం.. ఇంటి స్థలం ఇవ్వడం మొదలుకొని ఇల్లు కట్టి ఇవ్వడం.. ఆ తరువాత పైసా ఖర్చు లేకుండా రూ.లక్షల విలువైన ఆస్తిని పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి, పూర్తి హక్కుదారులను చేస్తున్న సీఎంను మునుపెన్నడూ చూడలేదని ఆనందంగా చెబుతున్నారు. దీని ద్వారా ప్రతి మహిళా రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల ఆస్తికి హక్కుదారు అవుతూండటం విశేషంగా చెబుతున్నారు.

ఉచితంగా రిజిస్ట్రేషన్లు

నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద స్థలాలు, ఇళ్లు పొందిన మహిళలకు వాటిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసే మహాక్రతువు సోమవారం ప్రారంభం కానుంది. దీనిని వచ్చే నెల 9వ తేదీ నాటికి పూర్తి చేయనున్నారు. దీనికోసం 3,817 మంది పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బందిని వినియోగిస్తున్నారు. వీరందరికీ ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో రిజిస్ట్రేషన్లపై శిక్షణ కూడా ఇచ్చారు. గ్రామ/వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి, అర్హులకు కన్వేనియన్స్ డీడ్స్ ఇవ్వనున్నారు. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా పక్కాగా రిజిస్ట్రేషన్ చేసిన దాఖలాలు లేవు. అసైన్డ్ భూ చట్టానికి అనుగుణంగా డి–పట్టాలు ఇవ్వడంతో వాటిపై పేదలకు ఎటువంటి హక్కులూ ఉండేవి కావు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం చట్టసవరణ చేసి మరీ మహిళలకు సర్వహక్కులతో రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు ఐదారు వేల మంది మహిళలకు రిజిస్ట్రేషన్లు చేయనున్నారు.

జిల్లాల వారీ వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	కాలనీలు	ఎకరాలు	వ్యయం (రూ.కోట్లలో)
తూర్పు గోదావరి	83,568	437	2,051.03	909.27
కాకినాడ	1,52,316	319	3,600.99	1,531.40
కోనసీమ	67,052	245	1,811.44	728.95
మొత్తం	3,02,936	1,001	7,463	3,168.00

రిజిస్ట్రేషన్లకు ఏర్పాట్లు

జిల్లా	సచివాలయాలు	సిబ్బంది
తూర్పు గోదావరి	445	1,780
కాకినాడ	252	1,008
కోనసీమ	515	1,029
మొత్తం	1,212	3,817

ఇళ్ల యజ్ఞానికి ఇక్కడే శ్రీకారం

రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి ఇళ్లు ఇచ్చే బృహత్తర కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో కాకినాడ సమీపాన ఉన్న కొమరగిరి లే అవుట్‌లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం పలుచోట్ల యుద్ధప్రాతిపదికన ఇళ్ల నిర్మాణం జరుగుతూ ఊళ్లకు ఊళ్లే వస్తున్నాయి. ఇలా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా లే అవుట్లలో 3 లక్షల మందికి పైగా పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేస్తున్నారు. దీనికి పూర్తి భిన్నంగా చంద్రబాబు హయాంలో ఉమ్మడి జిల్లాలో పట్టాల పేరిట నిరుపేదలను మోసం చేశారు. ఏ ఒక్కరికీ సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు కూడా లేవు. ఎన్నికలకు ముందు స్థలాలు గుర్తించకుండానే హడావుడిగా తెల్ల కాగితాలపై పట్టాలు రాసేసి చేతిలో పెట్టి గాలికొదిలేశారని ఇప్పటికీ పలువురు మహిళలు శాపనార్థాలు పెడుతూంటారు.

వచ్చే నెల 9 వరకు రిజిస్ట్రేషన్లు



జిల్లాలోని ప్రతి సచివాలయంలో రిజిస్ట్రేషన్లకు నలుగురు చొప్పున పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతర ఉద్యోగులను కేటాయించాం. వచ్చే నెల 9 వరకూ ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తాం. మునుపెన్నడూ ఇలా నిరుపేదలకు ఇచ్చిన ఇళ్లను వారి పేరిట రిజిస్ట్రేషన్లు చేయడం చూడలేదు. అందునా మహిళల పేరిట చేయడం ఇదే తొలిసారి. చరిత్రలో ఇది నూతన అధ్యాయం.

– డాక్టర్ కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

రూ.లక్షల ఇంటిపై సర్వహక్కులూ ఇస్తున్నారు



మాది మత్స్యకార కుటుంబం. భర్త సత్తిబాబు లేడు. ఇద్దరు పిల్లలు. కుమారుడు కూలి పనికి వెళ్తూ ఆసరాగా ఉంటున్నాడు. కుమార్తె ఇంటర్ చదువుతోంది. బీచ్ రోడ్డును ఆనుకుని ఉన్న జగనన్న కాలనీలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నాలుగైదు లక్షల రూపాయల విలువైన స్థలం ఇప్పించారు. మా ఇంటికి రుణం కూడా ఇచ్చారు. ఇప్పటి వరకూ రూ.1.62 లక్షలు మా చేతికిచ్చారు. అన్ని వసతులతో ఇంటిని అందంగా నిర్మించుకోవడం చాలా సంతోషంగా ఉంది. నీడ లేని మా కుటుంబానికి ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన స్థలం కొండంత ధైర్యం ఇచ్చింది. ఇప్పుడు ఇంటికి రిజిస్ట్రేషన్ కూడా చేస్తున్నారు. ఇన్ని లక్షల రూపాయల విలువైన ఆస్తిని ఈ ప్రభుత్వం మానవత్వంతో మా బిడ్డలకు అందించింది.

– మోసా నూకరత్నం, లైట్ హౌస్ ప్రాంతం, సూర్యారావుపేట, కాకినాడ రూరల్

కలలో కూడా ఊహించలేదు



మేము 35 సంవత్సరాలుగా అద్దె ఇంట్లోనే కాలం గడుపుతున్నాం. భర్త చింతా వీరన్న. మాకు ఇద్దరు మగ పిల్లలు. అద్దె ఇంటి యజమానులు ఖాళీ చేసి వెళ్లిపొమ్మన్నప్పుడు ఇళ్లు మారడానికి మేము పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కూలి పనితో జీవిస్తూనే పిల్లలిద్దరినీ చదివించుకున్నాం. జగనన్న కాలనీలో సెంటున్నర స్థలం ఇచ్చారు. దీని విలువ రూ.2.5 లక్షలు ఉంటుంది. ఇల్లు కట్టుకోవడానికి రూ.1.80 లక్షలు ఇచ్చారు. ఇప్పుడు ఇంటిని కూడా మా పేరిట సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారంటే నమ్మలేకపోతున్నాం. జగనన్న మేలును ఎప్పటికీ మరువలేను.

– చింతా సత్యవేణి, హౌస్ నంబరు 19, జగనన్న కాలనీ, సోమేశ్వరం, రాయవరం మండలం

మావల్ల కాదు బాబూ..

- నేడు చంద్రబాబు పర్యటన
- కాతేరులో రా.. కదలి రా సభ
- జనసేనతో సీట్ల సిగపట్లు
- స్పష్టత ఇవ్వని టీడీపీ అధినేత
- సభ నిర్వహణపై నిర్లిప్తంగా ఆ పార్టీ శ్రేణులు



సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన ఆ పార్టీ శ్రేణులకు ఉత్సాహాన్ని ఇవ్వడం లేదా? నేతల మధ్య తారస్థాయికి చేరిన వర్గ విభేదాలు చక్కదిద్దకపోవడమే శ్రేణుల్లో నైరాశ్యానికి కారణమవుతోందా? నియోజకవర్గ ఇన్‌చార్జిల విషయంలో స్పష్టమైన నిర్ణయాలు చేయకపోవడం వైషమ్యాలకు మరింత ఆజ్యం పోసిందా? రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై ఎటూ తేల్చకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయా? ఇటువంటి ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. ఈ పరిస్థితుల్లో రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో సోమవారం చంద్రబాబు పాల్గొనే రా.. కదలిరా.. సభ నిర్వహణపై శ్రేణులు నిర్లిప్తంగా ఉంటున్నాయి. సాక్షాత్తూ అధినేత వస్తున్నా వారిలో అంత ఉత్సాహం కానరావడం లేదు. జనసేనతో పొత్తు విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం.. సీట్ల సిగపట్లతో సర్వత్రా గందరగోళం నెలకొన్న పరిస్థితుల్లో చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయడం తమ వల్ల కాదంటూ నేతలు చేతులెత్తేస్తున్నారు.

గోరంట్ల.. అంటీముట్టనట్టుగా..

రా.. కదలి రా సభ నిర్వహించే రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోనే చంద్రబాబుపై స్వపక్ష పార్టీ నేతలు గుర్రుగా ఉన్నారు. బాబు కంటే సీనియర్ నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. జనసేన పొత్తుతో తన సీటుకు ఎసరు పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నందున ఈ సభను విజయవంతం చేసేందుకు గోరంట్ల ముందుకు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. సభా ఏర్పాట్లను టీడీపీ ముఖ్య నాయకులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాటి పుల్లారావుతో బుచ్చయ్య చౌదరి కూడా పర్యవేక్షిస్తున్నా.. లోలోపల మాత్రం తనకు తగిన ప్రాధాన్యం లేదన్న భావనలో ఉన్నారు. రూరల్ స్థానం కచ్చితంగా తనదే అంటూ ప్రకటించుకుంటున్న బుచ్చయ్యకు ఈ సభలోనైనా చంద్రబాబు స్పష్టత ఇస్తారా, లేక ఎప్పటిలాగే దాటవేస్తారా అనే మీమాంస ఆయన వర్గంలో నెలకొంది. ఇదే జరిగితే రూరల్‌లో జనసేన, టీడీపీ నేతల మధ్య విభేదాలు మరింత తీవ్ర స్థాయికి చేరే అవకాశం ఉంది. ఒక్క రూరల్ నియోజకవర్గమే కాదు.. జిల్లా వ్యాప్తంగా ఏ నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే అభ్యర్థులపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో కుమ్ములాటలు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాజాన‘గరం’

రాజానగరం టీడీపీలో అంతర్మథనం మొదలైంది. పవన్ ఏకపక్ష ప్రకటనపై ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దీనిపై తాడోపేడో తేల్చుకునేందుకు నేరుగా మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లారు కూడా. ఇంత జరిగినా టీడీపీ రాష్ట్ర నేతలు కె.అచ్చెన్నాయుడు, ప్రత్తిపాటి పుల్లారావులు నియోజకవర్గానికి వచ్చి చర్చిస్తామని కంటితుడుపు మాటలతో సరిపెట్టారు. వారి మాటలు నమ్మి శనివారం రాత్రి వరకూ వెంకట రమణ చౌదరి కార్యాలయంలో టీడీపీ శ్రేణులు నిరీక్షించినా ఫలితం లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో సభకు తాము వెళ్లాలా, వద్దా అనే సందిగ్ధంలో వారు ఉన్నట్టు తెలిసింది.

ముఖం చాటేస్తున్న జనం

మరోవైపు తన పర్యటనలో చంద్రబాబు.. మునుపెన్నడూ చూడని సంక్షేమ, అభివృద్ధి పాలనను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పైన, వైఎస్సార్ సీపీ శ్రేణులపై ఆసాంతం తప్పుడు విమర్శలు గుప్పిస్తున్నారు. జరిగిన అభివృద్ధంతా తానే చేశానని గొప్పలు చెప్పుకునేందుకే సమయం కేటాయిస్తున్నారు. తాను అధికారంలోకి వస్తే ఎలాంటి పథకాలు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాల్సింది పోయి, సొంత డబ్బాకే పరిమితమవుతున్నారు. దీనిపై ఆ పార్టీ వర్గాలే విస్తుపోతున్నాయి. చంద్రబాబు తీరుతో విసిగిపోతున్న ప్రజలు ఆశించిన స్థాయిలో ఆయన సభలకు హాజరు కావడం లేదు. జనసమీకరణ చేద్దామన్నా.. తమకేం ఒరిగిందంటూ నేతలు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

గత పర్యటనల్లోనూ శృంగభంగమే..

చంద్రబాబు గతంలో కూడా జిల్లాలో పలుమార్లు పర్యటించారు. అప్పట్లో కూడా అడుగడుగునా అసమ్మతి స్వరాలే తప్ప.. సభలు విజయవంతమైన సందర్భాలే లేవు. గతంలో కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లో చంద్రబాబు రెండు రోజుల పాటు రోడ్‌షో, బహిరంగ సభలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, భారీగా జనం వస్తారని ఆశించారు. కానీ అందుకు భిన్నమైన పరిస్థితి ఎదురైంది. రోడ్‌షోలకు వందల సంఖ్యలో మాత్రమే జనం రావడంతో పార్టీ శ్రేణులపై బాబు ఆగ్రహంతో ఊగిపోయిన సందర్భాలు సైతం లేకపోలేదు. విభేదాలు చక్కబెట్టాల్సిన బాబు ‘జనసమీకరణే చేయలేని వారు పార్టీని అధికారంలోకి తెస్తారా? పద్ధతి మారాలి’ అంటూ తీవ్ర స్థాయిలో మందలించడంతో అప్పట్లో ఆ పార్టీ నాయకులే అవాక్కయ్యారు. కొవ్వూరులో నిర్వహించిన ‘రాష్ట్రానికి ఇదేం ఖర్మ’ సభ కూడా జనం లేక వెలవెలబోయింది. కనీసం 2 వేల మంది కూడా రాలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సభ ఏర్పాట్లలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జవహర్ వేలు పెట్టకూడదని ప్రత్యర్థి వర్గం హెచ్చరించడంతో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఫలితంగా సభకు ఆయన వర్గం దూరమైంది.

నేడు అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి (ట్రస్ట్‌బోర్డు) సమావేశం సోమవారం ఉదయం ప్రకాష్ సదన్ సత్రంలో జరగనుంది. చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఈఓ కె.రామచంద్ర మోహన్, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అధికారులు పాల్గొని, సుమారు 20 అంశాలపై చర్చిస్తారు. వచ్చే నెల పదో తేదీన ప్రారంభయ్యే మాఘమాసంలో సత్యదేవుని సన్నిధికి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన ఏర్పాట్లు, 20న భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించనున్నారు.

నేడు భారవికి వేటూరి కవితా పురస్కారం

తుని: స్థానిక చిట్టూరి మెట్రోలో వేటూరి కవితా పురస్కారాన్ని సోమవారం ప్రదానం చేయనున్నట్లు వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామజోగేశ్వరశర్మ ఆదివారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జేకే భారవికి వేటూరి పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. పట్టణంలోని అన్ని ప్రధాన ప్రాంతాల నుంచి సభా ప్రాంగణానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ అద్భుతం







సభలో ప్రసంగిస్తున్న పరిపూర్ణానంద సరస్వతి, ఎంపీ మార్గాని భరత్‌రామ్, హాజరైన ప్రజలు

- హిందూ సంగమంలో శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద
- త్వరలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేస్తామన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ అద్భుతమని, దీంతో ప్రపంచమంతా ఆ నగరి వైపు చూసిందని కాకినాడ శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి అన్నారు. అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యాన ఆదివారం హిందూ సంగమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పరిపూర్ణానంద మాట్లాడుతూ, రాముడు నడయాడిన నేలపై ఆలయాన్ని నిర్మించుకుని ప్రపంచానికి మనమేమిటో తెలియజేసుకోగలిగామని అన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, హిందువుల వందల ఏళ్ల నాటి కోరిక అయిన అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించడం, ఆ మహత్తర క్రతువును వీక్షించే మహద్భాగ్యం కలగడం మన పూర్వజన్మ సుకృతమని అన్నారు. బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ రోజున నగరంలో భారీ శోభాయాత్ర నిర్వహించామని, రాముని కల్యాణం, రామ పట్టాభిషేకం వేలాది మంది భక్తుల సమక్షంలో వేడుకగా నిర్వహించామని తెలిపారు. నగరంలోని నందం గనిరాజు జంక్షన్ వద్ద గుర్రంపై కత్తి పట్టుకుని ఉండే వీర శివాజీ విగ్రహాన్ని సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వామీజీ చేతుల మీదుగా బహుమతులు అందించారు. శ్రీ సత్యదేవా నర్సరీ పుల్లా ఆంజనేయులు సన్స్ ఆధ్వర్యాన వేల రకాల మొక్కలతో ఏర్పాటు చేసిన అయోధ్య రామ మందిరం నమూనా, నక్షత్ర వన మొక్కల స్టాల్ భక్తులను అలరించాయి. కార్యక్రమంలో హిందూ జాగరణ సమితి ప్రతినిధి ఆలే శ్యామ్ కుమార్, హిందూ జాగరణ సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, అధ్యక్షుడు దినేష్ వైష్ణవ్, ఉపాధ్యక్షుడు గుండేపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫ్యాన్సీ షాపు దగ్ధం

రూ.3 లక్షలకు పైగా ఆస్తినష్టం



అగ్నికి ఆహుతైన ఫ్యాన్సీ షాపు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు చెరువు గట్టు సెంటర్‌లో ఆదివారం తెల్లవారుజామున ఫ్యాన్సీ షాపు దగ్ధమైంది. గ్రామానికి చెందిన మట్టపర్తి తాతారావు ఫ్యాన్సీ, కూల్‌షాపు నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోగా, తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అది గమనించిన స్థానికులు తాతారావుకు సమాచారం ఇచ్చారు. మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక వాహనాలకు సమాచారం ఇచ్చారు. అయితే అగ్నిమాపకశాఖ వాహనం వచ్చేసరికే దుకాణంలోని మొత్తం మెటీరియల్‌తోపాటు కూలర్, రిఫ్రిజిరేటర్ తదితర వస్తువులు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షలకుపైగా ఆస్తినష్టం సంభవించినట్లు వీఆర్వో ఎస్.వీర బాబు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

మోటారు సైకిల్‌ను తగులబెట్టిన దుండగులు



దగ్ధమైన మోటారు సైకిల్

కొత్తపల్లి: ఇంటివద్ద నిలిపిన మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టడంపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. మండలంలోని పొన్నాడ శివారు రావివారుపోడుకు చెందిన బోణం కృష్ణ తన మోటారు సైకిల్‌ను శనివారం రాత్రి ఇంటి వద్ద నిలిపి ఉంచాడు. రాత్రి సమయంలో మోటారు సైకిల్‌పై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి మంట పెట్టారు. దీంతో కిటికీ తలుపుల అద్దాలు ఒక్కసారిగే శబ్దంతో పేలడంతో చంటి కుటుంబ సభ్యులు భయపడ్డారు. దీంతో బయటకు వచ్చి చూడగా అప్పటికే మోటారు సైకిల్ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. దీనిపై కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

▶▶సొంత వ్యాపారంతో నిలదొక్కుకున్నా



ఇంట్లో పచ్చళ్లు, జీడిపప్పు వ్యాపారం చేస్తున్న చిటికెన లక్ష్మి

నా పేరు చిటికెన లక్ష్మి. మాది అమలాపురం పట్టణం. శ్రీ చైతన్య మహిళా సంఘం (డ్వాక్రా) సభ్యురాలిని. వైఎస్సార్ ఆసరా పథకం కింద మా సంఘానికి నాలుగు విడతల్లో మొత్తం రూ.3.40 లక్షల రుణమాఫీ జరిగింది. మా సంఘంలోని పది మంది ఈ సొమ్మును పంచుకున్నాం. ఈ పథకం ద్వారా వచ్చిన సొమ్ముతో అమలాపురం ఎర్ర వంతెన వద్ద గల మా ఇంట్లోనే పచ్చళ్లు, జీడిపప్పు దుకాణం పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాను. మా కుటుంబం నేడు ఆర్థికంగా నిలదొక్కుకుంది అంటే అది జగనన్న పుణ్యమే. నా భర్త సత్యనారాయణ ఫొటో స్టూడియో నిర్వహిస్తారు. నాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి దాశరథి శ్రీహరి సుభాష్ పాలిటెక్నిక్ డిప్లమా చేస్తున్నాడు. మా అమ్మాయి దక్ష్య సూర్య ఉమా తులసి అమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. నేను అమ్మ ఒడి డబ్బులు అందుకుంటున్నాను. నేను టైలరింగ్ కూడా చేస్తాను. టైలర్‌కు ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేల సాయం కూడా పొందుతున్నాను. ఇన్ని రకాలుగా మా కుటుంబాన్ని ఆదుకుంటున్న జగన్ అన్నయ్య మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. ఆయనకే మళ్లీ ఓటు వేసి రుణం తీర్చుకుని కృతజ్ఞత చాటుతాం.

▶▶సీఎం జగన్ మాట తప్పలేదు



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం పదవిని చేపట్టిన వెంటనే డ్వాక్రా రుణమాఫీ చేసి మాట నిలుపుకున్నారు. మాది భారతి గ్రూపు. మా సంఘంలో 10 మంది సభ్యులం. మా సంఘంలో ఒక్కొక్క సభ్యురాలికి రూ.13,250 వంతున, నాలుగు విడతల్లో రూ.53 వేలు మాఫీ అయ్యింది. – జక్కంపూడి సత్యవిజయదుర్గ, ఆదుర్రు, డ్వాక్రా గ్రూపు సభ్యురాలు, మామిడికుదురు మండలం, కోనసీమ జిల్లా

పంపా రిజర్వాయర్‌లో గుర్తు తెలియని మృతదేహం

అన్నవరం: స్థానిక పంపా రిజర్వాయర్‌లో గుర్తు తెలియని యువకుని మృతదేహం ఆదివారం మధ్యాహ్నం పంట కాల్వ స్లూయజ్ వైపు ఒడ్డుకు కొట్టుకుని వచ్చింది. స్థానికుల ఫిర్యాదుతో అన్నవరం పోలీసులు ఈ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయసు 25–30 సంవత్సరాలు మధ్య ఉంటుందని గుర్తించారు. ఈ మృతదేహం గురించి ఇతర పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం ప్రత్తిపాడు ఆసుపత్రికి పంపిస్తున్నట్లు తెలిపారు.

రూరల్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణు, పిల్లి సుబ్రహ్మణ్యం తదితరులు

మంత్రి చెల్లుబోయిన వేణు

రాజమహేంద్రవరం రూరల్: రానున్న ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇద్దామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. శాటిలైట్ సిటీ గ్రామంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన టీడీపీ, ఇతర పార్టీల నుంచి నాయకులు, ఆటో కార్మికులు, మహిళలు అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి వేణు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిల్లి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో అధిక సంఖ్యలో పార్టీలో చేరడం ఆనందంగా ఉందని అన్నారు. శాటిలైట్ సిటీ గ్రామ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో పారిశుధ్య సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని చెప్పారు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, అందరూ గర్వపడేలా పని చేస్తానని స్పష్టంచేశారు. పిల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో మంత్రి వేణును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పిల్లి సిరిబాల, నాయకులు బత్తిన అప్పారావు, బొమ్ము శ్రీను కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

- సీనియర్ విభాగంలో గుమ్మిలేరు ప్రథమం
- జూనియర్స్ విభాగంలో కొవ్వాడ ఉత్తమం
- ఆసక్తిగా తిలకించిన జనం



పోటీ పడుతున్న ఎడ్లు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరుపుల

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదివారం శ్రీగౌరీశంకరుల రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందేలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక పోలవరం కాలువ గట్టు మార్గంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 13 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీ ఎత్తున జనాలు తరలివచ్చారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోరా శృతి చౌదరి ఎడ్లు ప్రథమ బహుమతి, కాకినాడ జిల్లా గొల్లప్రోలు గ్రామానికి చెందిన నిమ్మకాయల నూకరాజు ఎడ్లు ద్వితీయ బహుమతి, కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన నాగిరెడ్డి నారాయుడు ఎడ్లు తృతీయ బహుమతి కై వసం చేసుకొన్నాయి. వారికి రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు నగదును బహుమతిగా అందజేశారు. జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్లు, ద్వితీయ బహుమతి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి ఎడ్లు, తృతీయ బహుమతి అనకాపల్లి జిల్లా చౌడవాడకు చెందిన గెడ్డ అప్పారావు ఎడ్లు కై వసం చేసుకొన్నాయి. జూనియర్స్ విజేతలకి వరుసగా రూ.12వేలు, రూ.8 వేలు, రూ.6వేలు బహుమతులుగా నిర్వాహకులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా యనమల కృష్ణ, చేకూరి రామకృష్ణ, కంటే ఫణికుమార్ వ్యవహరించారు. విజేతలకు షీల్డ్, నగదును మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, ఎంపీటీసీ సభ్యురాలు జువ్వల సుజాత, నిర్వాహకులు బెంతుకుర్తి అబ్బాయి, జువ్వల బాబులు, బొల్లు సీతారామరాజు, జువ్వల దొరబాబు, జువ్వల చినబాబు, దాట్ల అప్పన్నబాబు పాల్గొన్నారు.

అమలాపురంలో బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నీ



బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

అమలాపురం రూరల్: కోనసీమలో తొలిసారిగా రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్ అమలాపురం కిమ్స్ కాలేజీలో జరుగుతోంది. ఈ పోటీలు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కర్ర బాబీ, ఉపద్రష్ట విజయ్, గంటికోట సాయి ఆధ్వర్యంలో హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ నెల 24న పోటీలు ప్రారంభించారు. వచ్చే నెల 2వ తేదీ వరకు జరుగుతాయి. ఆదివారం మొదటి మ్యాచ్‌లో విజయనగరంపై కాకినాడ రుద్రాసు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో గుంటూరు పవన్ జట్టుపై రాజమహేంద్రవరం హుకుంపేట జట్టు విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో నర్సీపట్నం జట్టుపై అంబాజీపేట జట్టు విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో రాజోలుపై నూజివీడు జట్టు విజయం సాధించింది.

సైన్యం, నావికా దళం సంయుక్త విన్యాసాలు



కాకినాడ సాగర తీరన విన్యాసాలలో భాగంగా అప్రమత్తంగా ఉన్న సైనికులు



కాకినాడ సాగర తీరాన సంయుక్త విన్యాసాలలో ఆర్మీ, నేవీ సైనికులు

కాకినాడ రూరల్: కాకినాడ సాగర తీరంలో తూర్పు నావికా దళం, సైన్యం సంయుక్త విన్యాసాలు సాగిస్తున్నాయి. కాకినాడ నుంచి ఉప్పాడ వెళ్లే మార్గంలో నేమాం వైఎస్ జగన్‌మోహనపురం జగనన్న కాలనీ ఎదురుగా బీచ్‌లో ఆదివారం ఉదయం నుంచి వివిధ రకాల విన్యాసాలలో నావికా దళం, సైన్యం పాల్గొన్నాయి. రెండు రోజుల పాటు సాగర తీరాన సాగే విన్యాసాలు సోమవారంతో ముగియనున్నాయి.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సోమవారం నుంచి జరుగుతుందని ఉమ్మడి జిల్లాల పర్యవేక్షక ఇంజినీర్ టీవీఎస్ఎస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలో సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆపరేషన్ విద్యుత్ భవన్ కార్యాలయం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్, రాజమహేంద్రవరం టౌన్, రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట, రామచంద్రపురం, అమలాపురం, రంపచోడవరం డివిజన్ కార్యాలయాల్లో ఈ నెల 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో విశాఖ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తామని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు, మధ్యాహ్నం 2:00 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ధరలపై సందేహాలు, సలహాలు సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా పాల్గొనవచ్చన్నారు.

కిరాణా షాపులో అగ్ని ప్రమాదం

రూ.10 లక్షల విలువైన సరుకు దగ్ధం



షాపులో దగ్ధమైన వస్తువులు

అంబాజీపేట: స్థానికంగా శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కిరాణా సరుకులతో పాటు విద్యుత్ పరికరాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. అంబాజీపేటకు చెందిన సత్తి త్రిమూర్తులు గణపతి ఎలక్ట్రికల్, కిరాణా స్టోర్స్‌ను ఇటీవలే ఏర్పాటు చేసుకున్నారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో షాపును మూశారు. షాపు నుంచి కారుతున్న ఆయిల్‌ను, పొగ వాసనను గమనించిన స్థానికులు ఆదివారం ఉదయం షాపు యజమానికి సమాచారం ఇవ్వడంతో షాపునకు ఉన్న తాళాలను తీసి చూడగా కొన్ని వస్తువులు దగ్ధం గాక మరికొన్ని వస్తువులు పొగబారిపోయి పాడైపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని చెప్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించి ఉండవచ్చునని షాపు యజమాని తెలిపారు. అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, అంబాజీపేట కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు రాజా పండు షాపులో దగ్ధమైన వస్తువులను పరిశీలించారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై కేసు

కొవ్వూరు: తనను అదనపు కట్నం కోసం అత్తింటివారు వేధిస్తున్నట్లు పట్టణానికి చెందిన కాపకాయల రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు తెలిపారు. హైదరాబాద్‌కి చెందిన సంతోష్‌తో 2021లో తనకు వివాహం అయ్యిందని, కొన్నాళ్లు సంసారం సాఫీగా సాగిందన్నారు. ఇటీవల భర్త సంతోష్, అత్తమామలు, బావలు కలిసి తనను మానసికంగాను, శారీరకంగాను వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు నిందితులు నలుగురిపైన కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

చురుగ్గా అంతర్వేది ఉత్సవ ఏర్పాట్లు

- ఫిబ్రవరి 16 నుంచి లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవాలు
- ఇప్పటికే రెండు దఫాల సమీక్షలు
- క్షేత్రంలో ఊపందుకున్న పనులు



అంతర్వేదిలో రంగులతో తీర్చిదిద్దుతున్న ఆలయ ప్రాకార మంటపం



దేవతామూర్తుల కటౌట్‌ల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న సర్వేబాదుల చత్రాలు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో వచ్చే నెల 16 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించనున్న లక్ష్మీ నృసింహుని వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు ఆయా శాఖల అధికారులు ప్రారంభించారు. కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై ఇప్పటికే ఈ నెల 6వ తేదీన అంతర్వేదిలో ఆర్డీవో కేశవవర్ధన్ రెడ్డి అధ్యక్షతన, ఈ నెల 19వ తేదీన అమలాపురంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్‌లను నిర్వహించారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు, కింది స్థాయి అధికారులకు ఇచ్చిన సూచనలతో క్షేత్రం స్థాయిలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా దేవస్థానంలో ప్రధాన ఆలయం, ఉపాలయాలు, రాజగోపురాలు, ప్రాకార మంటపానికి ఆకర్షణీయంగా రంగులు వేసే పనులు కొనసాగుతున్నాయి. ప్రాంగణంలో దేవతామూర్తుల భారీ కటౌట్స్ ఏర్పాటు చేసేందుకు సపోర్టు సర్వే బాదులతో చత్రాలను రూపొందిస్తున్నారు. క్షేత్రంలో ఇంటర్నల్ రహదారులను అభివృద్ధి చేసేందుకు పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ విభాగం చర్యలు చేపడుతోంది. స్థానిక పంచాయతీ వెహికల్స్ పార్కింగ్‌కు స్థలాలను గుర్తించే పనిలో ఉంది. అంతర్వేదికి వచ్చే ప్రధాన మార్గాల్లో ప్యాచి వర్క్‌పూర్తి చేసేందుకు ఆర్ అండ్ బీ శాఖ కసరత్తు చేస్తోంది. వీటితో పాటు గుర్రాలక్క ఆలయం మీదుగా ఉన్న దండుపుంత రహదారికి అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు.

'గూడెం'లో పశువులపై పులి దాడి



పులి దాడిలో గాయపడ్డ ఆవును పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు



పులి దాడిలో ఆవుకు అయిన గాయాలు



పులి పాదముద్ర

- గాయపడ్డ రెండు ఆవులు, ఒక దూడ
- భయాందోళనలో రైతులు, గ్రామస్తులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీ శాఖ అధికారులు

ద్వారకాతిరుమల: కొద్ది రోజులుగా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న పెద్ద పులి శనివారం అర్ధరాత్రి ద్వారకాతిరుమల మండలం దేవినేనివారిగూడెంలోకి ప్రవేశించింది. ఒక తోటలో కట్టి ఉన్న పశువులపై దాడి చేసింది. ఈ దాడిలో రెండు ఆవులు, ఒక ఆవు దూడ తీవ్రంగా గాయపడ్డాయి. దాంతో రైతులు, గ్రామస్తులు పులి భయంతో వణికి పోతున్నారు. వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రైతు పాకలపాటి మధు రోజులాగే పశువులను తన పామాయిల్ తోటలో శనివారం సాయంత్రం కట్టేశాడు. తిరిగి పాలు తీసేందుకు ఆదివారం తెల్లవారుజామున తోటలోకి వెళ్లాడు. అయితే ఒక ఆవు కట్టు తెంచుకుని దూరంగా, బెదురు బెదురుగా ఉండడాన్ని ఆయన గుర్తించాడు. దగ్గరకు వెళ్లి చూసేసరికి ఆ ఆవు శరీరంపై గాయాలు కనిపించాయి. అలాగే కట్టి ఉన్న మరో ఆవు, దూడ శరీర భాగాలపై కూడా బలమైన గాయాలు ఉండడాన్ని గమనించాడు. ఆ ప్రాంతంలో పులి పాద ముద్రలు ఉండడంతో భీతిల్లిన మధు విషయాన్ని స్థానిక రైతులకు, అటవీ శాఖ అధికారులకు తెలిపాడు. దాంతో పెద్ద ఎత్తున రైతులు, అటవీ శాఖ రాజమహేంద్రవరం సర్కిల్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తుల రెడ్డి, ఏలూరు జిల్లా డీఎఫ్‌వో రవీంద్ర ధామా, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ పశువులను పరిశీలించారు. అవి పులి పంజాతో కొట్టడం వల్ల ఏర్పడిన గాయాలేనని అధికారులు నిర్ధారించారు. అలాగే పులి పాద ముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు గ్రామంలో మైక్ ద్వారా ముందస్తు హెచ్చరికలు జారీ చేయించారు. పులి సంచరిస్తున్నందున దేవినేనివారిగూడెం, రామన్నగూడెం, చుట్టుపక్కల గ్రామస్తులెవరూ ఒంటరిగా బయట తిరగొద్దని, పొలాలకు వెళ్లే వారు గుంపులుగా వెళ్లాలని సూచించారు.